క్లుప్తంగా

విద్యారంగానికి ప్రాధాన్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కొండమ్మ

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక గాజులరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కౌమార దశలో వచ్చే మార్పులను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చారి, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: జిల్లాకు చెందిన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు తొలిసారిగా సీఎం కప్ హ్యాండ్ బాల్ పోటీల్లో క్వార్టర్స్ వరకు వెళ్లడం అభినందనీయమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్ అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడమే పెద్ద విజయం అని, ఇదే స్ఫూర్తిని కొనసాగించి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు జట్టు క్రీడాకారులను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.మల్లేశ్వరరావు, క్రీడాకారులు శ్రావణ్‌కుమార్, వీటీ వెంకటేష్, వి.వినయ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ మురళీమోహన్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ మురళీ మోహన్ సూచించారు. మండలంలోని సతివాడ జగనన్న కాలనీలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు నిర్ణీత సమయంలో ప్రారంభించి పూర్తి చేసుకోవాలన్నారు. మిగిలిన లబ్ధిదారులకు సతివాడ నుంచి దమరసింగి వెళ్లే రహదారిలో స్థలాలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఏఈ పవన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళలతో ప్రజా చైతన్యం

విజయనగరం పూల్‌బాగ్: కళలు ప్రజల కోసమని, ప్రజా చైతన్యం తీసుకువచ్చేందుకు కళలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జాతీయ కార్యదర్శి గని అన్నారు. ప్రజానాట్యమండలి విజయనగరం జిల్లా సమావేశం స్థానిక అమర్ భవన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈరోజు మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వారి ఆగడాలను ఎదుర్కొంటూ నూతన సాంస్కృతిక శాస్త్రాలను తయారు చేసుకుని ప్రజానాట్య మండలి ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కె. కృష్ణ, అధ్యక్షుడు టి.రాము, అప్పలనరసయ్య, అప్పన్న, వాసు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 12న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిరుద్యోగ సమస్యపై చర్చించి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమర్ భవన్‌లో జరిగిన సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి. వాసు, సుమన్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో విత్తనశుద్ధిపై రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ శోభ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘అమ్మఒడి’తో బంగారు భవిష్యత్

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- కొండవెలగాడలో అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడలో అమ్మఒడి చెక్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో చేపట్టిన మార్పులతో విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందిందని, అలాగే అమ్మఒడి లాంటి పథకంతో విద్యార్థులకు బంగారు భవిష్యత్ కలుగుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అమ్మఒడి కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి రూ.10.71 కోట్ల అమ్మఒడి నమూనా చెక్కును విద్యార్థుల తల్లులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. గత ప్రభుత్వం హయాంలో మన రాష్ట్రం విద్యావ్యవస్థలో 15 స్థానంలో ఉండేదని.. ప్రస్తుత మూడో స్థానానికి చేరుకుందంటే ముఖ్యమంత్రి జగనన్న ముందుచూపు ఫలితమేనని చెప్పారు. నాడు – నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకువచ్చారని కొనియాడారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పథకాలు అందించి ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నామన్నారు. భూటకపు హామీలతో మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబుతో పాటు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ వస్తున్నారని.. రానున్న ఎన్నికల్లో వారికి గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు.

సీఎం కృషికి సార్థకత: ఎమ్మెల్సీ పెనుమత్స

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ ఫలాల కారణంగా నేడు విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించినప్పుడే సీఎం కృషికి సార్థకత లభిస్తుందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూను సమూలంగా మార్చి ప్రతి విద్యార్థి సమగ్ర ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు చనమళ్ల వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు, పట్టణ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మజ్జి గణేష్, ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథం, పీఏసీఎస్ చైర్మన్ కేపీ నాయుడు, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు, ఎంఈఓలు యూఎస్ఎన్ మూర్తి, విజయ్‌కుమార్, నాయకులు కర్రోతు వెంకటరమణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: పెదతాడివాడలో జరిగిన కార్యక్రమంలో అమ్మఒడి నమూనా చెక్కు అందిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు



డెంకాడ: కోలాటం నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విద్యకు దూరం కాకూడదనే ‘అమ్మఒడి’

డెంకాడ: ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదన్న మహోన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నారని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని పెదతాడివాడ సచివాలయం ఆవరణలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మఒడి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. విద్యతో సమాజం పురోభివృద్ధి చెందుతుందని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భావించి అందుకు అనుగుణంగా పని చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోట్, పాఠ్యపుస్తకాలు మొదలుకుని యూనిఫారాలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని చెప్పారు. అమ్మఒడి పథకం ద్వారా మండలంలోని 5,390 మంది విద్యార్థులకు రూ.8 కోట్ల, 8 లక్షల 50 వేలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం పెదతాడివాడ, ఊడికలపేట, బేతనాపల్లి, గుండాలపేట పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓలు కె.వెంకటరమణ, సీహెచ్ రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కరుమజ్జి త్రినాథరావు, ఎంపీటీసీ సభ్యులు గాదిపల్లి రమేష్, పొంతపల్లి జగన్నాథం, డీటీ సూర్యకాంతం, పెదతాడివాడ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వీపీ నరసింగరావు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, సెక్రటరీ రెహనా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీరాములనాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరు సచివాలయాలు.. 4,557 ధ్రువపత్రాలు

- నగరంలో పండగ వాతావరణంలో జగనన్న సురక్ష కార్యక్రమం
- దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేసిన నగర మేయర్

పైసా ఖర్చు లేకుండా..



నా పేరు మామిడిపాక ఉషారాణి. మాది 12వ వార్డు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. వారం రోజుల్లో పిలిచి ఇచ్చారు. ప్రభుత్వ అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు పొందాలంటే ఈ పత్రాలే ఆధారం. ఒకప్పుడు ఈ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటికి వచ్చి వివరాలు సేకరించి వాళ్లే సర్టిఫికెట్లు ఇస్తున్నారు.



దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు మరింత సులభతరంగా అందించాలనే ప్రధాన లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో పండగ వాతావరణంలో సాగుతోంది. శుక్రవారం నగరంలోని ఆరు సచివాలయాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో 11 రకాల ప్రభుత్వ సేవలకు సంబంధించి 4,557 ధ్రువపత్రాలు దరఖాస్తుదారులకు అందజేశారు. 10వ సచివాలయంలో 485 మందికి, 11వ సచివాలయంలో 870 మందికి, 12వ సచివాలయంలో 1005 మందికి, 13వ సచివాలయంలో 860 మందికి, 14వ సచివాలయంలో 404 మందికి, 15వ సచివాలయంలో 924 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందించారు. 11వ డివిజన్ షాదీఖానా వద్ద 13,14,15 సచివాలయాలకు సంబంధించి.. అలాగే 9వ డివిజన్ సుంకరవీధిలోని సత్యనారాయణస్వామి ఆలయం ప్రాంతంలో 10,11,12 సచివాలయాలకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమాల్లో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ధ్రువపత్రాలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. మొత్తం 11 రకాల ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, నగరంలో సచివాలయాల వారీగా జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు రేగాన రూపాదేవి, సయ్యద్ గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, బొంగ భానుమూర్తి, పిలక శ్రీనివాసరావు, చిట్టిల్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో లబ్ధి

- ఎంపీడీఓ రామారావు



పూసపాటిరేగ: గోవిందపురంలో పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ , జేసీఎస్ కన్వీనర్, తదితరులు

పూసపాటిరేగ: జగనన్న సురక్ష ద్వారా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. మండలంలోని గోవిందపురం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న సురక్షతో ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. అర్హత ఉండి పథకాలు పొందలేని వారికి ఇదొక మంచి అవకాశమని చెప్పారు. అనంతరం 529 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఏపీఓ రత్నమాల, ఏపీఎం పెంటం నాయుడు, సర్పంచ్ బాలా రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు డి. సునీత, ప్రజాప్రతినిధులు పట్టివు శ్రీనివాసరావు, బాలా అప్పలరాజు, డి. ఈశ్వరరావు, రాతు సాయికుమార్, జనపాల అప్పారావు, పసుపులేటి మహేష్ పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: 8వ వార్డులో అర్జీదారులకు టోకెన్లు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ వెంకట కృష్ణారావు

నగర పంచాయతీలో జగనన్న సురక్ష సర్వే..

నెల్లిమర్ల రూరల్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహించారు. 8వ వార్డులో వైస్ చైర్మన్ కారుకొండ వెంకటకృష్ణారావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటా పర్యటించి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ధ్రువపత్రాలకు సంబంధించిన టోకెన్లు అందజేశారు. 5వ వార్డులో కౌన్సిలర్ చిక్కాల సుమతి సర్వేలో పాల్గొన్నారు.

వితరణ ..



మాట్లాడుతున్న పరిశ్రమ జీఎం కమలాకరరెడ్డి, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి గ్రామంలో గల మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు అరబిందో గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎక్సిస్ లిమిటెడ్, శ్రేయ పరిశ్రమల సహకారంతో సుమారు 5 లక్షల రూపాయల విలువ గల బోర్‌వెల్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా అరబిందో పరిశ్రమ జీఎం కె.కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ, పరిశ్రమ సహకారంతో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా తాగునీరు ప్లాంట్‌ను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో శ్రేయ పరిశ్రమ జీఎం పి. గోపాలకృష్ణారెడ్డి, మెరైన్ సీఐ కె. వైకుంఠరావు, ఎస్సై పి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో కేసలి అప్పారావు, తదితరులు

విజయనగరం రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు ఆకాంక్షించారు. కోరుకొండ సమీపంలోని వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ అసోసియేషన్ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల విద్యార్థి కె.విహార్ వర్మ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలవగా కేసలి అప్పారావు ఆ విద్యార్థికి శుక్రవారం నగదు బహుమతి, మెమొంటో అందజేశారు. అలాగే ఏడుగురు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు, పతకాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తోట వీరాస్వామి, ప్రిన్సిపాల్ బి.లక్ష్మణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీను, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

11న డిప్యూటీ స్పీకర్ జలాసన ప్రదర్శన



జలాసన ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈశ్వర్‌కౌశిక్, తదితరులు

విజయనగరం: ఈత వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసేందుకు గాను ఈ నెల 11న జాతీయ స్విమ్మింగ్ పూల్ డే సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి జలాసన ప్రదర్శన చేపడుతున్నారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. అన్ని క్రీడా సంఘాల తరఫున ఈ ప్రదర్శనకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో సెట్విజ్ సీఈఓ బి.రాంగోపాల్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి జలాసన ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత బిజీ జీవితాల్లో ఈత అనేది అందరికీ అవసరమని.. క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. అందులో భాగంగానే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆక్వా స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణతో పాటు, మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కు వద్ద స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు స్వయంగా ఈనెల 11న కంటోన్మెంట్‌లోని ఆక్వా స్టేడియం వద్ద స్విమ్మింగ్ పూల్ లో సుమారు గంట పాటు నీటిపై తేలియాడేలా జలాసన ప్రదర్శన చేపడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని చెప్పారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్ దాస్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లేశ్వరరావు, రెజ్లింగ్, అథ్లెటిక్, తైక్వాండో, బాస్కెట్ బాల్, టెన్నిస్ బాల్, ఖోఖో కార్యదర్శులు లక్ష్మణరావు, బాబ్జి, లీలా, చారి, రాజీవ్, రవికుమార్, సత్యనారాయణ, ఎల్‌వీ రమణ, చీఫ్ కోచ్ రమణ పాల్గొన్నారు.

నవజీవన్ సంస్థ సేవలు అభినందనీయం

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న శ్రావణి, తదితరులు

విజయనగరం: జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వృద్ధులు, అనాథలకు నవజీవన్ సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఎంతోమందిని ఆదుకుంటున్న సంస్థ ఫౌండర్ కె.శ్రీధర్ ఆచార్య సేవలను కొనియాడారు. శుక్రవారం స్థానిక కణపాకలోని వృద్ధాశ్రమంలో అన్నలక్ష్మి కార్యక్రమంలో భాగంగా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రావణి మాట్లాడుతూ, సంస్థ తరఫున భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మణరావు, విజయ పాజిటివ్ నెట్‌వర్క్ ప్రతినిధి చౌదరి, మజ్జి పద్మావతి, మాతృభూమి సేవా సంఘం ప్రతినిధి ఇప్పలవలస గోపి, నటుడు రాంబార్కి రామానాయుడు, బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న అనూషా పట్నాయక్ , తదితరులు

విజయనగరం టౌన్: శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఏపీ శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూషా పట్నాయక్ , వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు శుక్రవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై పార్లమెంట్‌లో చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జయింతి ఉమామహేశ్వరరావు, ఎంపీ.గౌరీశ్వరరావు, రేగ సురేష్, వి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు..



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ జాన్ ప్రసాద్

విజయనగరం క్రైమ్: యువత మాదకద్రవ్యాల జోలికి పోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.జాన్‌ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీగణపతి జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల మత్తు జీవితాన్ని ఏ విధంగా చిత్తు చేస్తుందో వివరించారు. గంజాయి సమాచారం తెలిస్తే 14500 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.మధుకుమార్, ఎస్ఈబీ కానిస్టేబుల్ గంగాధర్ రెడ్డి, కళాశాల యాజమాన్యం , విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు సహకరించాలి..

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షా పథకం అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూహక్కు పత్రాన్ని అందించే ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. జూలై నెలాఖరు నాటికి మొత్తం భూ సర్వే పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ లోపభూయిష్టమైన అవాంతరాల వల్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయామన్నారు. 52 స్క్వేర్ కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న నగరంలో 36 స్క్వేర్ కిలోమీటర్ల పరిధిలో భవనాలు ఉన్నాయని, మరో 16 స్క్వేర్ కిలోమీటర్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించటం జరిగిందన్నారు. ఇప్పటివరకు 60 శాతం సర్వే పూర్తి చేయగా.. ప్రజల సహకారంతో మరో 40 శాతం జరగాల్సి ఉందన్నారు. నగరంలో 69 వేల గృహ సముదాయాలు ఉండగా.. 58 వేల భవనాలకు సంబంధించిన వివరాలు సేకరించడం జరిగిందని, అందులో 2 వేల భవనాలు వన్నూ పరిధిలోకి రాకుండా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. భూమిని ప్రజల సమక్షంలోనే సర్వే చేసి కచ్చితమైన కొలతలు వేసి చూపించబడతాయన్నారు. భూమికి విశిష్ట గుర్తింపు గల నంబర్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి శంకుస్థాపన మహోత్సవాలు

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శంకుస్థాపనల మహోత్సవాన్ని శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు కమిషనర్ శ్రీరాములనాయుడు వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేతుల మీదుగా రూ.కోటి వ్యయంతో గంటస్తంభం జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు సీటీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఉదయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ వరకు రూ.10.15 కోట్లతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో 116 పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏసీపీ అమ్మాజీరావు, టౌన్ సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.